క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి ప్రతి రెండవ, నాల్గవ శనివారం సాయంత్రం ఓపీ చూడటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీవీఈఓ

వేంపల్లె : మండల కేంద్రమైన చక్రాయపేటలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను కడప జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రంతుబాషా ఆధ్వర్యంలో అధ్యాపక సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని, 2026 ఇంటర్ ఫలితాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు డీవీఈఓ స్వయంగా మధ్యాహ్నం భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె సీఐగా బాల మద్దిలేటి



చింతకొమ్మదిన్నె : స్థానిక పోలీస్‌స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా సీఐ బి.బాలమద్దిలేటి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఎంపీలు నిబంధనలు అతిక్రమించరాదు



మాట్లాడుతున్న పట్టణ వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఆర్ఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక అర్బన్ హెల్త్ కేంద్రంలో ఆర్ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లినిక్‌లలో యాంటీబయాటిక్స్ సూదులు, మాత్రలు ఇవ్వకూడదని అలా ఇచ్చినట్టు రుజువైతే శాశ్వతంగా క్లినిక్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని ఆర్ఎంపీల క్లినిక్‌లలో తనిఖీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఓబులేసు, వైద్య బృందం పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



వెల్లటూరులో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీసీటీవో గీతా వాణి

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు రైతులకు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డి.సి.టి.ఓ గీతావాణి, వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. శనివారం వెల్లటూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. దుకాణాదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించి తప్పని సరిగా రసీదు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించినట్లు రుజువైతే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు రసాయనిక ఎరువులు అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. రైతులకు నానో యూరియా అందుబాటుతో ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణ సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జన వేడుకలు



పులివెందులలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శనివారం వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పట్టణంలోని గుంత బజార్, అమ్మవారిశాల, మారుతి హాలు రోడ్డు, పార్నపల్లె రోడ్డు తదితర ప్రాంతాలలోని వినాయకుని మండపాలలో వినాయకున్ని ప్రత్యేక వాహనంలో ఉంచి కన్నుల పండుగలా వినాయకుని గ్రామోత్సవం నిర్వహించారు. బ్రాహ్మణపల్లెలో వినాయక మండపం వద్ద గణేష్ యువత ముగ్గుల పోటీలు నిర్వహించగా ఈ పోటీలలో సర్వసతి, అఖిల, గంగాదేవిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య యువకులు చిందులేస్తూ వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గణపతి బొప్ప మోరియ అంటూ నినాదాలతో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పులివెందుల రూరల్ : 21వ వార్డు కౌన్సిలర్ కోడి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం నిర్వాహకులు లడ్డూకు వేలం పాట నిర్వహించారు. అదే వార్డుకు చెందిన జినిగల రమణ, చంద్రశేఖర్ నాయుడులు రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండల వ్యాప్తంగా గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. శనివారం సుమారు 100కు పైగా గణనాథులను నిమజ్జనం చేశారు. బాణసంచా పేల్చుకుంటూ డప్పు వాయిద్యాలతో ఊరేగించి నందిపల్లె గ్రామం పరిధిలోని చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేశారు. జై బోలో మహారాజ్‌కీ జై అంటూ నినదించారు. వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సీఐ నరసింహులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో గణేషుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వల్లూరు, గణేషపురం, పాపాఘ్ని నగర్ తదితర గ్రామాల్లో శనివారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. లడ్డూ, చెరుకు గడ ప్రసాదాల వేలం పాట నిర్వహించారు. గణేష్‌పురంలో జరిగిన వేలం పాటలో స్వామివారి లడ్డును వెంకటసాయి రూ 36 వేలకు, చెరకు గడలను నిమ్మకాయల భాను రూ.4500 సొంతం చేసుకున్నారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, గణపతి బొప్పా మోరియా, గణేష్ మహరాజ్‌కీ జై అంటూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. యువకులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, గోటూరు వంకలో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.



ఎర్రగుంట్ల : మహేశ్వనగర్ కాలనీలో ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : వినాయకుడి నిమజ్జనం వేడుకలు మండల పరధిలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిర్రాజుపల్లిలో వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. శాంతినగర్ కాలనీలో వినాయకుడి నిమజ్జనం ఉత్సవం వైభవంగా సాగింది. మహేశ్వనగర్ కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.



కొండాపురం : గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు, యువకులు

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : పట్టణం, మండల పరిధిలో వినాయకుడికి ఘనంగా భక్తులు పూజలు నిర్వహించారు. పలు చోట్ల కుర్చీ పోటీలు, ముగ్గుల పోటీలు, పాటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని బురుజుపల్లె, రేగడిపల్లె, తదితర గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రేగడిపల్లెలో లడ్డు వేలంపాటలో ఆ గ్రామ యూత్ అసోసియేషన్ రూ. 40,500 సొంతం చేసుకున్నారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండపాల్లో కొలువుదీరి పూజలందుకున్న గణనాథులు శనివారం నిమజ్జనానికి బయలుదేరాయి. మండలంలోని పలుగ్రామాల్లో విఘ్నేశ్వరుని విగ్రహ మూర్తులను భక్తులు రంగులు చల్లుకుంటూ మేళతాళాల మధ్య కోలాహలంగా నిమజ్జనానికి తరలివెళ్ళాయి.



పులివెందులలో వేలంపాటలో స్వామి వారి లడ్డూను దక్కించుకున్న రమణ, చంద్రశేఖర్ నాయుడులు



వేంపల్లెలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



చిర్రాజుపల్లిలో వినాయకుడి నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి



జమ్మలమడుగు : వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ముద్దనూరులో నిమజ్జనానికి తరలుతున్న గణేషుడు



ఎర్రగుంట్ల : వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు



ఎర్రగుంట్ల : వినాయకుడి వద్ద మహిళలు

తిరుమలరెడ్డి సేవలు ప్రశంసనీయం



తిరుమలరెడ్డిని అభినందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు

పులివెందుల/రూరల్ : తిరుమలరెడ్డి(ఎస్ఆర్ఐ) పేద ప్రజల కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి భాకరాపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వీరపునాయునిపల్లె మండలం మెయిళ్ల చెరువు గ్రామానికి చెందిన కంభం తిరుమలరెడ్డి తన తల్లిదండ్రులు తిరుమలరెడ్డి, రామలక్షుమ్మల జ్ఞాపకార్థం చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేశారు. శనివారం వైద్య శిబిరం ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై తిరుమలరెడ్డిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దాదాపు ఈ శిబిరంలో 840 మంది పరీక్షలు చేయించుకోగా 105 మందికి సర్జరీలు చేశారన్నారు. 135 మందిని చెన్నై ఆసుపత్రికి రెఫర్ చేశారన్నారు. శంకర్ నేత్రాలయ వైద్య బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు రాజశేఖర్, కిశోర్, రసూల్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లపురెడ్డిపల్లెలో యువకులు నూతనంగా ఏర్పాటు చేసిన ఫామ్ సపోర్ట్ ట్రస్ట్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ ట్రస్ట్ నిర్వాహకులు ఫామ్ సపోర్ట్ ట్రస్ట్ ద్వారా పేద రైతులకు సహాయ సహకారాలు అందించే విధంగా ట్రస్ట్ ఏర్పాటు చేశారు.పేద రైతులు ఎవరైనా పంటలు సాగు చేసేందుకు డబ్బులు లేకపోతే ట్రస్ట్ ద్వారా డబ్బులు ఇస్తారన్నారు. రైతులకు కావాల్సిన మొక్కలను తక్కువ ధరలకే పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బలరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి



సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

కమలాపురం : పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబాఫకృద్దీన్ తెలిపారు. శనివారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్ రావుతో కలసి విజిట్ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. ఏ కేసులో జైలుకు వచ్చారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యంపై సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయ సహాయం పొందే విధానం గురించి వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ఖైదీలకు సమస్యలుంటే మండల న్యాయ సమితిని సంప్రదించాలన్నారు. లేని పక్షంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన ఖైదీల కు సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సిబ్బంది, న్యాయ వాదులు, పారా లీగల్ వలంటరీలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేసి ఖైదీలకు ఎర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్, భోజన గది, టాయిలెట్లు, వసతి గదులను పరిశీలించి మాట్లాడారు. నిరుపేదలైన ఖైదీలు ఉంటే వారికి లాయర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని సూచించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందవచ్చు అని సూచించారు. ఖైదీలు ఎవరైనా అనారోగ్యంగా ఉంటే వారికి వెంటనే వైద్యం చేయించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం అని ఈగల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. కడప శంకరాపురం లోని గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువతకు భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తిస్తూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కట్టడికి ఏర్పాటుచేసిన ‘ఈగల్’ టాస్క్ ఫోర్స్ అధికారులు ప్రత్యేక కృషి చేస్తున్నారని చెబుతూ ఎన్‌డీపీఎస్ చట్టంలోని కఠిన శిక్షలు గురించి స్పష్టంగా వివరించారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

వేంపల్లె : గతంలో కంటి ఆపరేషన్ చేసుకున్న వారికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి వెల్లడించారు. శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి చెకప్ చేస్తారన్నారు. మరింత సమాచారం కోసం 9502485242 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రాగి, వేపచెట్లకు కల్యాణం



రాగి, వేప చెట్ల కల్యాణంలో వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : పట్టణంలోని స్థానిక గాడిచర్లవారి వీధిలో వెలసిన రాగి, వేప చెట్లకు శనివారం ఎడాల సుబ్రహ్మణ్యం దంపతులు, భక్తుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్‌లు హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక భక్తమండలి, యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా ఒత్తిడి నియంత్రణ



మాట్లాడుతున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : ధ్యానం ద్వారా ఒత్తిడిని నియంత్రించవచ్చునని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శనివారం ట్రిపుల్‌ఐటీలోని క్యాంపస్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్-4 సంయుక్త ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వరి, విభాగాధిపతి డాక్టర్ సౌజన్యల పర్యవేక్షణలో హార్ట్ ఫుల్ మెడిటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ మాట్లాడుతూ ధ్యానం చేయడంవల్ల మానసిక ఒత్తిడి, ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం ఒక గంటసేపు ధ్యానం చేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్, నాగవేణిలు మెడిటేషన్ విధానాన్ని వివరించి మొదటి రోజు సాధన చేయించారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.
అలాగే ధ్యాన కార్యక్రమం పై మార్గదర్శనం అందించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలకు పరామర్శ



లింగాల : లోపట్నూతలలో శివారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కమలాపురం : టౌన్ కన్వీనర్ గంగాధర్ రెడ్డిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

లింగాల : మండలంలోని లోపట్నూతల, దిగువపల్లెల్లో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులు అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లోపట్నూతల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఎంపీ ఆయన ఇంటికి వెళ్లి ఆయన భార్య సరస్వతి, కుమారులను పరామర్శించారు. దిగువపల్లెకు చెందిన చదువుల రోశిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన ఇంటికి వెళ్లి ఆయన భార్య గంగాదేవి, కుమారులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.వి.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం పార్టీ టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి భార్య, 15వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సంధ్యారాణి అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను పరామర్శించారు. అలాగే వైఎస్సార్ సీపీ మండల మహిళా నాయకురాలు సావిత్రమ్మ చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను పరామర్శించారు. 9వ వార్డు కౌన్సిలర్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి సోదరుడైన రామసుబ్బారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన నివాసానికి వెళ్లి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్లలో.

ఎర్రగుంట్ల : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డి సోదరుడి కుమారుడైన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆసుపత్రికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన పరామర్శించారు.

సాదాసీదగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కమిషనర్, కో ఆప్షన్ సభ్యుల మధ్య జరుగుతున్న చర్చ

ఎర్రగుంట్ల : పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సభాభవనంలో సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి 20 మంది కౌన్సిలర్లకుగాను మున్సిపల్ చైర్మన్, ఇద్దరు వైస్ చైర్మన్లు, నాలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. మిగిలిన వారందరు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యుడు దాసరి సూర్యానారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పారిశుద్ధ్య కార్మికులు అధికంగా ఉన్నారని మళ్లి తాత్కాలికంగా దినసరి కూలీ మీద కొత్త కార్మికులను తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయంలోనే తాత్కాలికంగా పారిశుద్ధ్యం కార్మికులను తీసుకోవాలని కౌన్సిల్ ఆమోదించిందన్నారు. కౌన్సిలర్ ఎరికలరెడ్డి మాట్లాడుతూ సమీపంలో ఉన్న ఫ్యాక్టరీ వల్ల కాలుష్యం అధికంగా వస్తుందని దీనిని నివారించాలని కోరారు. కౌన్సిలర్లకు, అధికారులకు మధ్య ఏదైన సమస్య వస్తే కో ఆప్షన్ సభ్యులు సర్దుబాటు చేయాల్సి ఉందని, అంతేకాని కౌన్సిలర్ల మాదిరిగా ప్రశ్నించకూడదని కమిషనర్ తెలిపారు. తర్వాత అజెండాలోని అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జెబూన్నీసా, చంద్రకళ, కౌన్సిలర్లు ఎరికలరెడ్డి, శివప్రసాద్, పెన్నారషీద్, సునీత, కో ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్ రఫీలు, ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ కిరణ్‌కుమార్, టీపీఓ రమణారెడ్డి, టీఎంసీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ నిత్యానందరాజు

చింతకొమ్మదిన్నె : క్లస్టర్ సమావేశాలలోని ముఖ్యాంశాలను నోటు చేసుకుని తరగతి గదులలో అమలు చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ నిత్యానందరాజు తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ సమావేశాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. క్లస్టర్ సమావేశాలకు 100 శాతం హాజరుకావాలని బుక్ లెట్‌పై ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ముఖ్యంగా సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉంచి వారి అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్ పై అవగాహన పెంచుకుని వాటిని సకాలంలో పూరించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల మార్కుల ఎంట్రీ, తల్లికి వందనం పథకంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.